క్లుప్తంగా

మిత్రుడికి చేయూత



సాయం అందిస్తున్న స్నేహితులు

ఖానాపూర్: ఆపదలో ఉన్న స్నేహితుడికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు తోటి మిత్రులు. ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదోతరగతి తరగతి చదివిన సీతారాం ఇటీవల ఓ ప్రమాదంలో కాళ్లు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. అతడితో పదోతరగతి చదివిన స్నేహితులు పోగు చేసిన రూ.18వేలు, రూ.3,700 విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు.

తిర్పెల్లిలో సన్మానం



వీడీసీ సభ్యులను సన్మానిస్తున్న యువకులు

లక్ష్మణచాంద: తమ గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నందుకు మండలంలోని తిర్పెల్లి వీడీసీ సభ్యులను అదే గ్రామానికి చెందిన యువకులు మంగళవారం శాలువాలతో సన్మానించారు. రోడ్లు నిర్మించడం, విగ్రహాలను ప్రతిష్ఠించడం తదితర కార్యక్రమాలు చేసినందుకు వీడీసీ సభ్యులను సన్మానించినట్లు యూత్ సభ్యులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీవో

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని బాదనకుర్తి గ్రామంలో డ్రై డే నిర్వహించగా ఏఎన్ఎం యోత్స్నా, పంచాయతీ కార్యదర్శి సురేందర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లోని ఖాళీడబ్బాలు, డ్రమ్ములు, పూల కుండీల్లో నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం



నూతన కార్యవర్గం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో మంగళవారం మండలంలోని లింగాపూర్, సారంగపూర్, ఎలగడప, దిల్దార్‌నగర్ గ్రామాలకు కలిపి విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోలిపాక రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా పొలాస వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా వెగంటి లింగమూర్తి, కోశాధికారిగా, సంకోజి రమేశ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా సాధన చేయిస్తున్న శిక్షకుడు

మామడ: యోగా సాధనతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని శిక్షకుడు యోగేందర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని పొన్కల్ గ్రామంలో యోగా ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ నర్సారెడ్డి, ఏఎస్ఎం భారతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంక్షల్లేకుండా ధాన్యం కొనాలి

కుంటాల: తడిసిన ధాన్యాన్ని ఆంక్షల్లేకుండా ప్రభుత్వం కొనాలని మంగళవారం లోకేశ్వరంలో కుంటాల మండలానికి చెందిన బీజేపీ నాయకులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. జొన్నలు అమ్మి 35 రోజులు గడుస్తున్నా.. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మాజీ ఎంపీపీ అరుణ రమణారావు, వెంగల్ రావు, జక్కుల గజేందర్, కల్యాణ్, గజేందర్ ఉన్నారు.

జాబితా విడుదల

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను మంగళవారం పాఠశాల నోటీస్ బోర్డుపై ఉంచినట్లు ప్రిన్సిపాల్ కాసు నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు వచ్చే నెల 2,3,4 తేదీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు పాఠశాలలో అందించాలని ఆయన కోరారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం



మాంజ్రి గ్రామంలో వంగిన విద్యుత్ స్తంభం



మాంజ్రి నుంచి పాంగ్రి వెళ్లే మార్గంలో..



పాంగ్రి నుంచి చుచుంద్ వెళ్లే మార్గంలో..

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి, పాంగ్రి గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యను విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి వంగిన స్తంభాలను సరి చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

బస్టాండ్ ఆవరణ జలమయం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ జలమయమైంది. మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి బస్టాండ్ ఎదుట రెండు అడుగుల లోతులో నీరు వచ్చి చేరింది. ప్రధాన రహదారికి దిగువన బస్టాండ్ ఆవరణ ఉండటంతో వరద వచ్చి చేరింది. ప్రయాణికులు బురద నీటిలోనే బస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు.



రాకపోకలకు ఇబ్బందులు..



భైంసారూరల్: ఇటీవలి వర్షాలకు భైంసా మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ఏర్పడిన గుంతలో నీరు నిలవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో డ్రెయినేజీలు సరిగా లేక రోడ్డుపైనే మురుగునీరు, వర్షపు నీరు ప్రవహిస్తోంది. డ్రెయినేజీలను శుభ్రం చేసి రోడ్డుపై గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏళ్లుగా సాగు చేస్తున్నాం.. ఇబ్బంది పెట్టొద్దు

- అటవీ అధికారులతో పోడు భూములు సాగుచేసే రైతుల వాగ్వాదం



పెంబి మండలం ఇటిక్యాల్‌లో నేలపై పడుకొని నిరసన తెలుపుతున్న మహిళా రైతు

కడెం: ఏళ్లుగా సాగు చేస్తున్నాం.. తమను ఇబ్బంది పెట్టొద్దని పోడు భూములు సాగు చేసే రైతులు అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మంగళవారం కడెం మండలంలోని నవబ్‌పేట్, మంగల్‌సింగ్‌తండాల్లో పట్టాలు లేని పోడు భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన అటవీ అధికారులను ఆయా గ్రామాల్లోని పోడు రైతులు అడ్డుకున్నారు. వెంటనే తమ భూముల్లో నుంచి వెళ్లిపోవాలని గొడవకు దిగడంతో అటవీ అధికారులు వెనుదిరిగారు. ఇందులో కడెం, ఉడుంపూర్ ఎఫ్ఆర్‌వోలు గీతారాణి, అనిత, డీఆర్వోలు సిద్దార్థ, వసంత్, రవి, అరుణ్ తదితరులున్నారు.

పెంబి: మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో మంగళవారం పోడుభూముల్లో మొక్కలు నాటేందుకు వెళ్లిన అటవీ అధికారులను రైతులు అడ్డుకున్నారు. 1985 నుంచి 80 ఎకరాల్లో ఉన్న పోడు భూములను 50 మంది సాగు చేసుకుంటున్నట్లు రైతులు పేర్కొన్నారు. మొక్కలు నాటకుండా మహిళా రైతులు నేలపై పడుకొని నిరసన తెలపడంతో అటవీ అధికారులు వెనుదిరిగారు. పెంబి ఎఫ్ఆర్‌వో రమేశ్‌రావు, సిబ్బంది ఉన్నారు.

ట్రెంచ్‌పనులపై రగడ

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామశివారు ప్రాంతంలో అటవీ అధికారులు ప్లాంటేషన్ పేరిట ట్రెంచ్(కందకం) పనులు చేపట్టడం ఆందోళనకు దారితీసింది. గ్రామానికి చెందిన బోసు భూమన్న, నర్సయ్య కొన్నేళ్లుగా గ్రామశివారులోని పోడు భూమిలో సాగు చేస్తున్నారు. తాజాగా ఎఫ్ఆర్‌వో కిరణ్ ఆదేశాల మేరకు ఎఫ్ఎస్‌వోలు రవీందర్, రత్నయ్య, సదాశివ్, ఎఫ్‌బీవోలు నరేందర్, నారాయణ, మోహిద్, ఇతర అధికారులు ప్లాంటేషన్ కోసం పొక్లెయినర్‌తో ట్రెంచ్ పనులతోపాటు నీరు ఇంకే గుంతల పనులు చేపట్టారు.



కడెం : నవబ్‌పేట్‌లో అటవీ అధికారులను అడ్డుకుంటున్న రైతులు



ఖానాపూర్: తర్లపాడ్ శివారులో అధికారులతో వాగ్వాదానికి దిగిన పోడు రైతులు, నాయకులు

ఈ విషయం తెలిసిన బాధిత రైతులతోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరి తిరుపతి తదితరులు అక్కడికి వెళ్లి అధికారులతో వాగ్వాదానికి దిగి పనులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎఫ్ఆర్‌వో కిరణ్‌ను వివరణ కోరగా ఎఫ్‌డీపీటీ ఆదేశాల మేరకు గిరిజనేతరుల పోడు భూముల్లో ప్లాంటేషన్ కోసం పనులు చేపడుతున్నామని తెలిపారు. బుధవారం తిరిగి పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

'పోడు' రైతులకు పట్టాలివ్వాలి

పెంబి: పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇటిక్యాలలో పోడు రైతులతో మాట్లాడారు. మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో 40 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలో అటవీ అధికారులు మొక్కలు నాటడం ఆపాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, రాజేశ్,శంకర్, పోడు రైతులు ఉన్నారు.

30న 'చలో బోరిగాం' విజయవంతం చేయండి

తానూరు: ముధోల్ మండలం బోరిగాం గ్రా మంలో దళితులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ (ఎఎంఎస్‌ఏ) వి ద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 30న తలపెట్టిన చలో బోరిగాం కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని వంచిత్ భహుజన్ అ ఘాడి తాలూక అధ్యక్షుడు మాధనూరే రహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా బోరి గాంలో బుద్ధ విగ్రహం ప్రతిష్ఠాపన సందర్భంగా కొందరు దళితులపై దాడికి తెగబడ్డారన్నారు. బౌద్ధమహాసభ నాయకులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పశువుల సంత మూసివేత

భైంసాటౌన్: పట్టణంలోని ఏఎంసీ(వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహించే పశువుల సంతను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పూర్యా నాయక్ తెలి పారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణా జరగకుండా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఈనెల 27 నుంచి జూన్ 17 వరకు సంత మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి జూన్ 24 నుంచి యథా విధిగా సంత నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాలకవర్గం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రైతులు, వ్యాపారులు గమనించి సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ముధోల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మంత్రి సీతక్క.. కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. ముధోల్ మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన సీతక్క అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు వస్తాయని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బాబురావు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావుపటేల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



కడెం పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు



లక్ష్మణచాందలో అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

కడెం: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్‌లోని సీఎం ఇంటి ముట్టడికి వెళ్తున్న మండలంలోని మాజీ సర్పంచ్‌లను మంగళవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. బిల్లులు చెల్లించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు మొలుగూరి రాముగౌడ్, సొదాని శ్రీకాంత్‌యాదవ్, కొప్పుల లక్ష్మీలచ్చన్న, విజయస్టీఫెన్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎం ఇంటి ముట్టడికి హైదరాబాద్‌కు వెళ్తున్న మండలంలోని వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ముత్యంరెడ్డి, భూమేశ్, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, జీవన్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: పెండింగ్ బిల్లులు చెల్లించలేక.. ప్రభుత్వం పాలనా వైఫల్యంతో మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం సరికాదని సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు పార్శపు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. అరెస్టయిన వారిలో కొడారి గోపాల్, అడిదెల మహేందర్ తదితరులు ఉన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



నివాళులర్పిస్తున్న కళాకారులు

ఖానాపూర్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లాలోని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం భక్తిమల్ల గ్రామానికి చెందిన నట్టల స్వప్న అనే కళాకారిణి ఈనెల 20న ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోగా.. మంగళవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోల వెంకటేష్, కోరుట్ల సిద్దు, నేదురి సాయిరాజ్, కొండవేని రమేశ్, దాసండ్ల ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

వర్షంలో ఎస్పీ బందోబస్తు



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ముధోల్: మండలకేంద్రంలో మంగళవారం మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా.. ఎస్పీ జానకీ షర్మిల అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు బందోబస్తు పరిశీలిస్తూ సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ఖానాపూర్: ఫర్టిలైజర్ దుకాణాల్లో డీలర్లు ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ సుజాత అన్నారు. మండలంలోని సత్తనపల్లి గ్రామ రైతువేదికలో మంగళవారం ఎరువులు, విత్తనాల దుకాణాల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టాలని.. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జగదీశ్వర్, ఏఈవో రాకేశ్ తదితరులు ఉన్నారు.

30 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభిక్‌వర్గ

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు మూడు రోజులపాటు 'ప్రారంభిక్ వర్గ'పేరిట ప్రశిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్మల్ నగర సంఘ సంచాలక్ డాక్టర్ టి.ప్రమోద్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని విజయ హై స్కూల్ కేంద్రంగా ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని.. ఇంటర్ ఆపై చదువులు చదివిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 90520 42090 లో సంప్రదించవచ్చని వివరించారు.

'డబుల్' ఇళ్లను అర్హులకు ఇవ్వాలి

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉన్న అనర్హులను తరలించేందుకు అధికారులు సర్వే పేరిట కాలయాపన చేయడం ద్వారా నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్.ఉపాలి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో మాట్లాడారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు సర్వేను పూర్తి చేయడం లేదని ఆరోపించారు. అర్హులను గుర్తించడంలో అధికారుల వైఫల్యం కారణంగా నేడు ఎంతో మంది పేదలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతినగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు కడారి సాయమ్మ, దివ్యాంగురాలైన ఆమె కూతురు లలిత ఇళ్లు లేని కారణంగా చెట్ల కింద నివసిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు అనర్హుల సర్వేను పూర్తి చేయకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగు సాయి, రామిడి హరీశ్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

'బీఆర్ఎస్ నేతల అరెస్టు సరికాదు'



భైంసాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు విలాస్ గాదేవార్

భైంసాటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్తలు విలాస్ గాదేవార్, పి.రమాదేవి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలో మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. సకాలంలో ధాన్యం కొనకపోవడంతో ధాన్యం తడిసి రైతులు గోస పడుతుంటే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కుంటాల: లోకేశ్వరంలో కొమురం భీం విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన మంత్రి సీతక్కను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకునేందుకు యత్నించారు. వారిని పోలీసులు అరెస్టు చేసి కుంటాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉంచారు. అరెస్టయిన వారిలో మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, శ్యాంసుందర్, రజినీకాంత్, వంశీ, రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే సీజీఆర్ఎఫ్



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ సభ్యులు

బాసర: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్(విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) దృష్టికి తీసుకురావాలని సీజీఆర్ఎఫ్ సభ్యులు రామకృష్ణ, రాజాగౌడ్, కిషన్ పేర్కొన్నారు. మంగళవారం బాసర విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని 25 వినతిపత్రాలను అందజేశారు. కొద్దిరోజులుగా బాసరలో విద్యుత్తు హెల్పర్లు లేకపోవడంతో చాలా సమస్యలు పేరుకుపోయాయని.. వెంటనే ఇద్దరు సహాయకులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. సకాలంలో నూతన విద్యుత్ కనెక్షన్లు అందించడం, లోఓల్టేజీ సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. వాటిల్లో కొన్ని ఫిర్యాదులను అప్పటికప్పుడు పరిష్కరించగా మిగతావి త్వరలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ ఎస్ఈ సుదర్శన్ భైంసా, ఏఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు అఖిల్, కార్యదర్శి అఫ్సర్, ఉపాధ్యక్షుడు కైఫ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాహుల్ గైక్వాడ్‌కు ఫిర్యాదు చేశారు. అతడిపై చర్యలు తీసుకొని సదరు ఛానల్‌ను మూసివేయాలని కోరారు.